## క్లుప్తంగా

### ఆంజనేయస్వామికి అభిషేక పూజలు


కౌతాళంలో పూజలందుకుంటున్న ఆంజనేయ స్వామి

కౌతాళం: మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం భక్తులు అధికంగా తరలి వచ్చి పూజలు నిర్వహించారు. దీంతో ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. మండల కేంద్రంతో పాటు అగసలదిన్నె, బుడుములదొడ్డి, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. తెల్లవారు జామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలు జరిపించారు.

### గుడిసె దగ్ధం


గుడిసెలో మంటలు చెలరేగుతున్న దృశ్యం

కోసిగి: మండలంలోని దుద్ది గ్రామానికి చెందిన ఎండపల్లి మూకయ్య, నాగేంద్రమ్మకు చెందిన గుడిసె విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. శనివారం ఉదయం భార్య భర్తలు ఇద్దరు పిల్లలను గుడిసె దగ్గరే వదిలేసి కూలీ పనులకు వెళ్లారు. పిల్లలు బయట ఆడుకుంటున్నారు. గుడిసెలో ఎవరూ లేని సమయంలో షార్ట్ సర్క్యూట్ జరిగి గుడిసెలో నిప్పులు చెలరేగాయి. గుడిసెలో గ్యాస్ సిలిండర్ ఉండడం ఎవరూ మంటలు ఆర్పే ప్రయత్నం చేయలేక పోయారు. చివరకు గ్రామస్తులు బిందెలతో నీళ్లు పోసి మంటలు ఆర్పేశారు. గుడిసెలో ఉన్న రూ.50వేలు నగదు, బంగారం, తిండి గింజలు, బట్టలు, వంట సామగ్రి, టీవీ కాలిబూడిదయ్యాయి. దీంతో దాదాపు రూ.4లక్షలు వరకు ఆస్తినష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు.

### ఉపాధి పనులు నిలిపివేయడం అన్యాయం

కర్నూలు(సెంట్రల్): ఆదోని మండలంలో రాజకీయ కారణాలతో ఉపాధి హామీ పనులను నిలిపి వేయడం అన్యాయమని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వీరశేఖర్, కార్యదర్శి కేవీ నారాయణ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి రావడంతో ఫీల్డ్ అసిస్టెంట్లను మార్చిన తరువాతే ఉపాధి పనులు చేపట్టాలని అధికారులపై ఆ పార్టీ నాయకులు ఒత్తిడి తీసుకురావడం మంచి పద్ధతి కాదన్నారు. రాజకీయ కారణాలతో పనులు నిలిచిపోతే మండలంలోని 44 గ్రామాల ప్రజలు ఇబ్బంది పడతారని, జిల్లా కలెక్టర్ కలగజేసుకొని పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

### ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న సి.నాగరాజు

ఆదోని రూరల్: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కొత్త ప్రభుత్వం చొరవ చూపాలని ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు సి.నాగరాజు కోరారు. శనివారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర కౌన్సిలర్ బి.మహాదేవప్ప మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల విధులకు అనారోగ్య కారణాలరీత్యా గైర్హాజరైన ఉపాధ్యాయుల సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేసి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎం.సి.సుంకన్న మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ అమలుపరిచే లోగా మధ్యంతర భృతిని ప్రకటించాలని కోరారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా ఆర్థిక కమిటీ సభ్యులు బి.రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి బి.గోపాల్, మండల అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, బి.సుధాకర్‌బాబు, ఆదోని పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రవి, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

### అంజన్నకు విశేష పూజలు



హాలహర్వి: మండలంలోని క్షేత్రగుడి గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి శనివారం భక్తులు అర్చకులు ప్రహ్లాద్ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి పంచామృతాభిషేకం, జలాభిషేకం, కుంకుమార్చన, ఆకు పూజ తదితర పూజలు చేపట్టారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.

**అగ్రహార ఆంజనేయస్వామికి..**

హొళగుంద: మండల పరిధిలోని తెల్లకొండ వద్ద వెలిసిన అగ్రహార ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు.

# భూసార పరీక్ష.. పుడమికి రక్ష

- పరీక్షలతో నేల స్వభావంపై కచ్చితమైన అంచనా
- ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం
- భూసారం పెంపొందేందుకు చర్యలు
- తగ్గనున్న పంటల సాగు ఖర్చు
- అధిక దిగుబడులకు అవకాశం

మూస పద్ధతిలో పంటలు సాగు చేసి ఇష్టారీతిన రసాయనిక ఎరువులు, మందులు వాడుతుండటంతో నేల నిస్సారంగా మారుతోంది. క్రమేణా దిగుబడులు పడిపోతుండటం, అధిక ఉత్పత్తి కోసం మరింత ఖర్చు చేసి రైతన్నలు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. అలా కాకుండా.. పంటల సాగుకు ముందే నేల స్వభావాన్ని తెలుసుకునేందుకు భూసార పరీక్షలు చేయించి ఫలితాల ఆధారంగా మందులు, ఎరువులు వినియోగించడం, సరిపడ పంటలు సాగుచేస్తే నేల సారవంతమవడమే గాకుండా సాగు ఖర్చు తగ్గి, అధిక దిగుబడులు పొందే అవకాశముంటుంది.


గోనెగండ్లలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది (ఫైల్)

గోనెగండ్ల: వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గి, దిగుబడులు పెరగాలంటే భూసార పరీక్షలు కీలకమని నిపుణులు పేర్కొంటున్నారు. సాగు భూమిలో భూసార పరీక్షలు చేయించడం నేలలోని పోషకాలు, పోషకాల లోపం, ఆమ్ల, క్షార, స్థితి, చౌడు, ఇతర సమస్యలు తెలుస్తాయి. అలాగే.. ఏ ఎరువులు ఎంత మోతాదులో వాడవచ్చో తెలియడంతో అనవసర వ్యయం గణనీయంగా తగ్గుతుంది. వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు పొందే మార్గాలను అనుసరించాలి. భూమిలో ఉన్న పోషకాలు, లోపాలు తెలుసుకుని వాటికి అనుగుణంగా పంటల సాగు, ఎరువుల వినియోగానికి భూసార పరీక్షలు ఎంతగానో దోహదపడుతాయి. అధిక దిగుబడులు సాధించే లక్ష్యంతో కొంతమంది అన్నదాతలు రసాయన ఎరువులు, పురుగుమందులు అవసరానికి మించి వినియోగిస్తుండడంతో భూమిలో పోషకాలు నశిస్తున్నాయి. దీంతో నత్రజని తగ్గి భూమి ఉత్పాదక శక్తిని కోల్పోయి చౌడుబారడంతో పాటు చీడపీడల ఉధృతి, వాతావరణ కాలుష్యం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. భూసార పరీక్షలతో నేల భౌతిక, రసాయన లక్షణాలు తెలుసుకునేందుకు అవకాశం కలుగుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

**నమూనాల సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**

పంటకోత పూర్తయిన తర్వాత, వేసవి పంటలు లేని సమయాల్లో మట్టి నమూనాలు సేకరించాలి. పొలాలకు సాగునీరు పెట్టినప్పుడు, ఎరువులు వేసిన తరువాత మట్టి నమూనాలు సేకరించకూడదు. పొలాల్లో నీడ పడే ప్రదేశాలు, గట్లు, చెట్లు ఉన్న ప్రాంతాల్లో మట్టి నమూనా తీయకూడదు. ముందుగా నేలపై ఉన్న గడ్డి, చెత్త, కలుపు మొక్కలు తీసివేయాలి. వరి పొలంలో వి ఆకారంలో 15–20 సెంటీమీటర్ల లోతున పారతో గుంత తీసి పైపార నుంచి కింది వరకూ ఒక పక్కగా మట్టిని సేకరించాలి. వ్యవసాయ క్షేత్రంలో జెడ్ ఆకారంలో సుమారు ఎనిమిది ప్రదేశాల్లో సేకరించిన మట్టిని క్వార్టరింగ్ విధానంలో భాగా కలిపి అరకేజీ బరువు వచ్చేలా తీసుకుని నీడలో ఆరబెట్టాలి. మట్టి బాగా ఆరిన తరువాత పాలిథిన్ కవర్‌లో నింపి రైతు వివరాలు, సర్వే నంబర్, విస్తీర్ణం, గతంలో సాగు చేసిన పంట తదితర వివరాలు నమోదు చేసి పరీక్ష కేంద్రాలకు పంపుతారు. వ్యవసాయ పంటలు పండించే భూముల్లో 6 అంగుళాల లోతు నుంచి నమూనా సేకరించాలి. పంట్ల తోటలకు మూడు అడుగుల లోతులో ప్రతి అడుగుకు ఒక నమూనా, చౌడు, ఆమ్ల నేలల్లో అడుగు లోతుతో ప్రతి 6 అంగుళాలకు ఒక నమూనా తీయాలి.

**పోషకాల స్థాయిపై పక్కా లెక్క..**

వ్యవసాయ క్షేత్రాల్లో సేకరించిన మట్టిని ప్రయోగశాలలకు తరలించి వివిధ భౌతిక, రసాయనిక పద్ధతుల ద్వారా విశ్లేషించి నేల స్వభావాన్ని, లక్షణాలను తెలియజేస్తారు. ఆయా భూముల్లో లవణాల సాంద్రత, నేల, ఆమ్ల, క్షార గుణాలు, ఆ నేలలో ఉన్న పోషకాల స్థాయిని విశ్లేషించి వాటి ఫలితాల ఆధారంగా వేయాల్సిన పంట, ఎరువుల మోతాదును సూచిస్తారు. దీంతో సాగు ఖర్చు తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధించుకునే అవకాశం కలుగుతుంది.

**భూసార పరీక్షలు ఎంతో మేలు**



భూసార పరీక్షల ఆధారంగా ఏ పంటకు ఎంత మోతాదులో పోషకాలు అవసరమో తెలుస్తుంది. దీంతో భూమిలో లోపించిన పోషకాలను గుర్తించి దానికి అనుగుణంగా ఎరువులను వినియోగించడంతో పెట్టుబడి ఖర్చు తగ్గించుకునే వీలు కలుగుతుంది. పంటలకు అవసరమైన పోషకాలను రసాయన రూపంలో కంటే సేంద్రియ, జీవన ఎరువుల రూపంలో అందించడం ద్వారా ఖర్చులు తగ్గించుకుని నాణ్యమైన దిగుబడులు పొందవచ్చు. – హేమలత, వ్యవసాయ అధికారిణి, గోనెగండ్ల

## ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి ఘన సన్మానం


ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కౌతాళం: మంత్రాలయం ఎమ్మెల్యేగా నాల్గవసారి విజయం సాధించిన వై.బాలనాగిరెడ్డిని కౌతాళం దేశాయి యూత్ ఆధ్వర్యంలో మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి ఇతర నాయకులు శనివారం ఎమ్మెల్యేతో పాటు ప్రదీప్ రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బుజ్జీస్వామి, సర్పంచ్ పాల్‌దినకర్, ఉప సర్పంచ్ తిక్కయ్య, మాజీ సర్పంచ్ అవతారం, మాజీ ఎంపీటీసీ చౌదరిబసవ, నాయకులు అబ్దుల్‌సమద్, వెంకటరామరాజు, నరసింహులు, భీమేష్, ఉరుకుంద ట్రస్టుబోర్డు డైరెక్టర్ వెంకోబ, వడ్డెరాము పాల్గొన్నారు.

## పంపిణీకి సిద్ధంగా పుస్తకాలు


పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 శ్రీనివాసులు

ఆదోని సెంట్రల్: పాఠశాలలు పునఃప్రారంభమైన రోజే విద్యార్థులకు పంపిణీ చేసేందుకు పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయి. నోట్‌బుక్స్ పూర్తి స్థాయిలో మండలానికి చేరుకోగా, పాఠ్య పుస్తకాలు ముద్రణా సంస్థల నుంచి విడతల వారీగా వస్తున్నాయి. ఆదోని నియోజకవర్గంలో ప్రభుత్వ, ఎయిడెడ్, పురపాలక ఉన్నత పాఠశాలలు 132 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 29,000 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎవరెవరికి ఏఏ నోట్ పుస్తకాలు అవసరమో ప్రణాళికలను సిద్ధం చేసి అధికారులకు పంపించగా వాటి ప్రకారం 14,50,000 నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. 8వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు గ్రాఫిక్స్ పుస్తకాలు 87,000 వచ్చాయి. పాఠ్యపుస్తకాలు 1, 2 తరగతులకు సంపూర్తిగా రాగా 3 నుంచి 10వ తరగతులకు సంబంధించి 60 శాతం వచ్చినట్టు మండల విద్యాధికారి–2 శ్రీనివాసులు తెలిపారు. పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలతో పాటు విద్యాకానుక కిట్లలో భాగంగా బ్యాగులు కూడా వచ్చాయన్నారు. వీటన్నిటిని పాఠశాల పునఃప్రారంభం రోజును పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

### రేపు మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో ఏపీ మోడల్ స్కూల్లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 10వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సమీరారెడ్డి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మోడల్ స్కూల్‌లో 7వ తరగతి, 9వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరానికి సంబంధించిన సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 10వ తేదీన ఉదయం 10 నుంచి 11.30గంటల వరకు పాఠశాలలోనే ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు.


విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేసిన వాల్మీకి సంఘం నాయకులు

### విద్యతోనే ఉజ్వల భవిష్యత్

నందవరం : విద్యార్థులకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని ఉపాధ్యాయులు ఉశేని, వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం స్థానిక బంగారమ్మ అవ్వ దేవాలయ ఆవరణలో ప్రభుత్వ పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వాల్మీకి సామజిక వర్గానికి చెందిన విద్యార్థులకు సంఘం పెద్దలు, ఉద్యోగులు వాల్మీకి ప్రతిభ పురస్కారాలతో పాటు బహుమతులను అందజేశారు. మండలంలోని 7 ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలో చదివిన 21 మందికి పురస్కారాలు, బహుమతులు అందజేశారు. అలాగే ఇంటర్మీడియట్ విద్యార్థులను సన్మానించి పురస్కారాలు అందజేశారు. లింగమూర్తి, మల్లేష్, వార్డు మెంబర్ రామాంజనేయులు, ఉపాధ్యాయులు తిమ్మారెడ్డి, నాగరాజు, నారాయణ, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

### క్రీడల్లో రాణించాలి

కర్నూలు (టౌన్) : క్రీడలపై ఆసక్తి పెంచుకొని రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించాలని జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ముప్పా రాజశేఖర్ అన్నారు. శనివారం స్థానిక బి. క్యాంపు క్రీడా మైదానంలో బి. క్యాంపు క్రీడా క్లబ్ క్రీడాకారులకు ఆయన టీషర్టులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడలకు కొంత సమయం కేటాయించాలన్నారు. తద్వారా ఒత్తిడిని అధిగమించి వచ్చాన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతో పాటు క్రీడల వైపు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో పాల్ విజయకుమార్, లక్ష్య ఫుట్‌బాల్ కోచ్ బ్రహ్మకుమార్, నవాజ్, విజయ్, శ్రీధర్, రంగడు పాల్గొన్నారు.

## అప్పుడే వాటాలు వేసుకుంటున్నారు


మాట్లాడుతున్న మాజీ కౌన్సిలర్ రామచంద్ర

ఆదోని అర్బన్: ఇంకా ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు, బీజేపీ ఎమ్మెల్యేగా పార్థసారథి ప్రమాణ స్వీకారం కూడా చేయకుండానే పట్టణంలో అధికార పార్టీ నాయకులు వాటాలు పంచుకుంటున్నారని టీడీపీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ రామచంద్ర విమర్శించారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం బుధవారం నుంచి అధికార పార్టీ నాయకులు ప్రభుత్వ కార్యాలయంలోని అధికారులను, డిపార్ట్‌మెంట్ అధికారులను మారుస్తామని, మిడ్డే మీల్స్, కోడిగుడ్ల కాంట్రాక్ట్ మేము తీసుకుంటామని, ఇసుక, గరుసు, మట్కా, బెట్టింగ్ వ్యవహారాలను నేను తీసుకుంటానని, పోరంబోకు స్థలాలు ఉంటే అనుభవిద్దామని, మావారినే వలంటీర్లుగా పెట్టుకుంటామని చెబుతున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకున్నా, ఆయనతో సంప్రదింపులు చేయకుండానే ఇలా వాటాలేసుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే పార్థసారథి ప్రజలకు సేవ చేయాలని, ఆదోని ప్రాంతాన్ని అభివృద్ధి చేద్దామని వచ్చారని, ఆయనకు చెడ్డ పేరు తేవద్దని సూచించారు. సమావేశంలో నాయకులు సోమశేఖర్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షం..పొలాల్లో ఇసుక మేటలు

- కొట్టుకుపోయిన నాటిన పత్తి విత్తనాలు

కోసిగి: మండలంలోని జంపాపురం, ఐరన్‌గల్లు, చిన్నభూంపల్లి, పెద్దభూంపల్లి, తుంబిగనూరు, సాతనూరు, అగసనూరు గ్రామాల్లో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగి పోర్లడంతో పంట పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. అలాగే చేల గట్టు కొట్టుకుపోయాయి. ఇటీవల ఐరన్‌గల్లు , జంపాపురంలో ముందస్తు వర్షాలకు ముందుగానే పత్తి, వేరుశనగ, ఉల్లి నాట్లు వేసుకున్నారు. అయితే భారీ వర్షం కురవడంతో నాటుకున్న విత్తనాలు కొట్టుకుపోయి రైతన్నలకు నష్టం మిగిల్చింది. ఐరన్‌గల్లు పొలాల్లో గట్లు కోసుకుపోవడంతో విద్యుత్ స్తంభాలు నేలవాలాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.


ఐరన్‌గల్ పొలాల్లో ఇసుక మేటలు వేసి దృశ్యం


వర్షపునీటి ధాటికి పొలాలు కోసుకుపోవడంతో కొట్టుకుపోయిన విత్తనాలు

### కార్యకర్తలకు అండగా ఉంటా


బుట్టా రేణుకను కలిసిన జామియా మసీదు కమిటీ పెద్దలు

ఎమ్మిగనూరుటౌన్: స్థానికంగా ఉండి పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక తెలిపారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆమెను పట్టణంతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల పార్టీ శ్రేణులు, స్థానిక జామియా మసీదు కమిటీ పెద్దలు కలిసి మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఓటమికి గల కారణం, పోలైన ఓట్లు తదితర అంశాలపై వారితో మాట్లాడి భవిష్యత్ కార్యచరణపై చర్చించారు. సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలోని ప్రజలు తనకు అధిక సంఖ్యలో ఓటు వేశారని అయినప్పటికీ స్వల్ప మెజారిటీతో ఓడిపోవడం బాధాకరమన్నారు. తన గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు అహర్నిశలు కృషి చేశారని అయితే ప్రజా తీర్పును గౌరవించాలని, గెలుపోటములు సహజమన్నారు. ఓటమితో ఎవరూ నిరుత్సాహపడవద్దని సూచించారు. మళ్లీ అవకాశం వస్తుందని అప్పుడు విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి పార్టీని బలోపేతం చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తామని చెప్పారు. జగనన్న ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొంటూ స్థానికంగానే ఉంటానని పార్టీ శ్రేణులకు తెలిపారు.తనకు ఓట్లు వేసిన ప్రజలకు, అందుకు కష్టపడిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. బుట్టా ప్రతుల్ పాల్గొన్నారు.

### నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1981–82 విద్యాసంవత్సరం టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వైష్ణవి కళాశాలల గ్రూప్స్ చైర్మన్ గడిగెలింగప్ప, మల్లెల గ్రూప్స్ అధినేత మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు శనివారం తెలిపారు. ఉదయం 10గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి 1981–82బ్యాచ్ విద్యార్థులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా నాడు తమకు చదువులు చెప్పిన గురువులకు సన్మాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమ నిర్వాహకులు మిట్టశంకర్, మాచాని శివశంకర్, మాచాని ఎర్రిస్వామి, గొల్లశ్రీనివాసయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా సిద్ధప్ప తాత జాతర


పూజలందుకుంటున్న సిద్ధప్పతాత మూలవిరాట్


భక్తజన సందోహం మధ్య రథోత్సవం

కౌతాళం: మండల పరిధిలోని నదిచాగి గ్రామంలో వెలసిన మహాయోగి సిద్ధప్పతాత జాతర శనివారం కనుల పండుగగా జరిగింది. తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, ప్రత్యేక పూజల అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలే కాక కర్ణాటక నుంచి వేలాది భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పరవీధుల గుండా రథోత్సవ కార్యక్రమాన్ని భక్తుల కోలాహలం మధ్య ఘనంగా చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.